

# పుస్తక పరిచయం




Navodaya Book House
Kachiguda X Roads
Hyderabad

ఆధునిక కవితా ప్రపంచంలో శ్రీశ్రీకి గల స్థానమూ, ఆయన ‘మహా ప్రస్థానం‘ గ్రంధం సృష్టించిన, కొనసాగిస్తున్న చరిత్రా అనితరసాధ్యం, అనుపమానం. ఎంతోమంది కవుల్ని తయారు చేసిన కవితా సంపుటి మహాప్రస్థానం. గత కొన్ని దశాబ్దాలుగా ఈ ‘మహాప్రస్థానం‘ గురించి ఎన్నో వివరణలూ, విశ్లేషణలూ, విమర్శలూ, పరిశోధనా వ్యాసాలూ వచ్చాయి. ఎన్నో సిద్ధాంతగ్రంధాలకు ఈ ‘మహాప్రస్థానం‘ ప్రాతిపదిక ఐంది. వెలువడి ఎన్ని దశాబ్దాలైనా, ఇంకా ఈ పుస్తకంపై విశ్లేషణలు రావడమూ, వాటిని కవితా ప్రియులూ ఆదరించడమూ, మహాప్రస్థానానికి గల బలాన్నీ, కవితాశక్తినీ ఋజువు చేస్తుంది. ఆ కోవకి చెందినదే ఈ పుస్తకం. ప్రముఖ సాహితీ కర్త, తెలుగు సాహితీ ప్రపంచంలో తనకంటూ ఒక స్థానాన్ని ఏర్పరచుకున్న కవి, రచయిత, విమర్శకులూ ఐన ప్రొ.మాదిరాజు రంగారావు గారు వ్రాసిన సాహితీ విశ్లేషణా గ్రంధం ఈ పుస్తకం. వీరు ఈ పుస్తకానికి చివరి వాక్యాలుగా వ్రాసిన "మహా ప్రస్థానం సంపుటిలో కవిత్వాన్ని సంపూర్ణంగా అర్థం చేసుకోడానికీ, అనుభవ విస్తృతిని పొందడానికీ ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య శాస్త్ర మర్యాదలతో పాటు కవిత్వంలో సంప్రదాయ మార్గమూ ఆధునిక సామాజిక రాజకీయ మనస్తత్వ శాస్త్ర ధోరణుల పరిచయమూ ఉంటే మంచిది‘ అన్న వాక్యాలకి నిజమైన ఋజువుగా ఈ పుస్తకంలో శ్రీశ్రీ కవితలని ఆమూలాగ్రం వివిధ కోణాల్లో విశ్లేషించారు. కవితా రీతీ, శైలీ, వివరణలే కాక విశ్లేషించిన ప్రతి కవిత వెనుకా వున్న సామాజిక, సాంఘిక పరిస్థితుల ప్రభావాన్నీ, కవిత రూపుదిద్దుకున్న నేపథ్యాన్నీ, కవి ఆ కవిత వ్రాయడం వెనుకనున్న అంతరార్థాన్నీ విశదంగా వ్రాసారు. మొత్తం 13 అధ్యాయాలుగా విభజించబడిన ఈ పుస్తకంలో ఒక్కో అధ్యాయంలో ‘మహాప్రస్థానం‘లోని ఒక కవితని తీసుకుని కూలంకషంగా చర్చించడం, విశ్లేషించడం, విమర్శించడం జరిగింది. శబ్ద ప్రధానమైన ‘తలుపు గొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపు కళ్ళెం..‘ లాంటి కవితా పంక్తుల్ని మామూలు పాఠకుడు ఏదో రిథమిక్ గా ఉందని చదువుతాడు. కానీ రంగారావుగారు అందులోని ప్రతి పదాన్నీ కవి ఎందుకు వ్రాసాడో, అది ఏ సత్యాన్ని నిరూపిస్తుందో, ఏ సందేశాన్ని వినిపిస్తుందో సవివరంగా వ్రాస్తారు.. శ్రీశ్రీ కవిత్వంలోని లోతుల్ని తెలుసుకోవాలనుకునే వారందరూ తప్పక చదవాల్సిన సాహితీ విమర్శనా గ్రంధం ఇది.




ఆధునిక కవితారంగంలో 'వచన కవిత' అన్న ప్రక్రియ మొదలయ్యాక కవిత్వం వ్రాసేవారు పెరిగిపోయారు - అనేది అందరూ ఒప్పుకునే సత్యమే. వచన కవిత్వం అసలు కవిత్వమేనా? ఒక పక్క 'వచనం' అంటూ మళ్ళీ అందులో కవిత్వమేమిటీ అన్న కొన్ని వాదనలని కాస్సేపు పక్కన పెడితే, వచన కవిత్వంలో కూడ చరిత్రసృష్టించిన కవితలెన్నో వచ్చాయన్నది నిర్వివాదాంశం. కవితల సంఖ్యతో పాటే కవితా రూపాల సంఖ్యకూడా పెరిగింది, తెలుగు భాషలో. మినీ కవితలూ, మైక్రో కవితలూ, హైకూలు, నానీలు..ఇవన్నీ విభిన్న వచనకవితా ప్రక్రియలు. దేని మీద ఎన్ని వివాదాలున్నా అన్ని ప్రక్రియల్లోనూ వ్రాసేవారు వ్రాస్తున్నారు, చదివే వారు చదువుతున్నారు. ప్రముఖ కవి ఆచార్య ఎన్. గోపి గారు ప్రారంభించిన సరికొత్త కవితా రూపమే 'నానీలు' కేవలం 20-25 అక్షరాలలోపు నాలుగు పదాలుగా వ్రాసిన కవితని 'నానీ'గా ప్రతిపాదించారు. మచిలీపట్నంలోని సాహితీ కురువృద్ధులు శ్రీ జి.సత్యనారాయణ గారు వ్రాసిన నానీల సంపుటే ఈ 'అక్షర క్షణాలు'. చిన్ని, చిన్ని పదాలతో కేవలం 20-25 అక్షరాల్లో సత్యనారాయణ గారు ఈ నానీల్లో పొదిగిన అర్థాలు అనంతం..

మచ్చుకి కొన్ని

'పసి నిఘంటులో / ఏడ్పుకు అర్థం? / తల్లికి తెలుసు / నువ్వారుకో.." - "అందని కొమ్మకై / ఎగరడం / బాల్యమే బాగుండేది / ఆగని ప్రయత్నం..". చాలా నానీలు పదేపదే - ఆలోచింపచేస్తాయి ఈ పుస్తకంలో. చదివి ఆనందించడానికీ, ఆలోచించడానికే కాక పదే పదే ఉదహరించడానికి కూడా ఉపయుక్తమయ్యే ఈ నానీలు వ్రాసిన జి.సనరా గారు అభినందనీయులు.

G.Satyanarayana
No.6 Maneesha Apartments
New Meerjalaguda, Malkajgiri
Secunderabad – 500 047
Phone: 2706 2477

---

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor
KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct
Dublin, CA 94568,USA